క్లుప్తంగా

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : విప్ ధర్మశ్రీ



గొంప గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం : నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కరించడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గొంపలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచినీటి ఇబ్బందులు ఉన్నాయని, డ్రైన్లు నిర్మించాలని కంట్రెడ్డి ముసిలమ్మ, ఈశ్వరమ్మ, కొర్ని సత్యారావు, పల్లా లక్ష్మణ తదితరులు ధర్మశ్రీకి తెలిపారు. రగిరాజులమ్మ, చినబుల్లి ఇళ్లు మంజూరు చేయాలని కోరగా అక్కడి కక్కడే ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రూ.78 లక్షల వ్యయంతో త్వరలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటవుతాయన్నారు. గ్రామానికి విచ్చేసిన ధర్మశ్రీకి సర్పంచ్ కంట్రెడ్డి గోవిందు ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ సర్పంచ్ అధికారి రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

సురక్ష కార్యక్రమంలో ఆధార్ లింక్ సేవలు



చమ్మచింత సచివాలయంలో ఆధార్ నంబర్లు లింక్ చేస్తున్న ఉద్యోగులు

నాతవరం: చమ్మచింత పంచాయతీలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో ఆధార్ నంబర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. అధికంగా ఆధార్ నంబర్లు లింక్ కాకపోవడంతో ఎంపీడీవో హనుమంతరావు ఆధ్వర్యంలో నమోదు చేశారు. వచ్చే నెల 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి సర్టిఫికెట్లతో పాటు సురక్ష కార్యక్రమంలో సూచించిన పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ చినబాబు, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



జగనన్న సురక్ష గురించి వలంటీర్లకు వివరిస్తున్న రాజేష్

కె.కోటపాడు : అర్హత ఉండీ సంక్షేమ పథకాలు వర్తించని కుటుంబాలకు జగనన్న సురక్షతో లబ్ధి కలుగుతుందని మండల సచివాలయాల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ అన్నారు. గుల్లేపల్లిలో వలంటీర్లతో కలిసి గురువారం ఆయన సర్పంచ్ బండారు దేముళ్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సాంకేతిక కారణాలతో పథకాలు వర్తించని వారి వివరాలను అధికారుల దృష్టికి వలంటీర్లు తీసుకు రావాలని, ఉచితంగా అందించనున్న 11 రకాల సేవలపై ప్రజలకు వివరించాలని తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ



డిప్యూటీ సీఎంతో బొడ్డేడ ప్రసాద్

మాడుగుల రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ గురువారం సాయంత్రం కృష్ణంపాలెంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువ కప్పి డిప్యూటీ సీఎంను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో జూలై 3న నిర్వహించే గురు పౌర్ణమి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచదార్ల పుణ్యక్షేత్రంలో సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు, అన్న సమారాధన చేయనున్నారు.

గిరిజనుల మోముల్లో చిరునవ్వులు

- జగనన్న చేసిన అభివృద్ధే కారణం
- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: నాడు గిరి గ్రామాలకు కొండ బాటలుండేవని, నేడు అవి బంగారు బాటలుగా మార్చడంతో ఏ గడపకు వెళ్లినా గిరిజనుల ముఖాల్లో సంతోషం కనిపిస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శంకరం పంచాయతీలో గిరి గ్రామాలైన వెలగలపాడు, కొత్తవలస, గొప్పూరు, తాడివలస, రాజంపేట, చుట్టిగెడ్డ, క్రిష్ణంపాలెం, రాయిపాలెం గిరి గ్రామాల్లో గురువారం కొండలు, గుట్టలు ఎక్కి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరించారు. శంకరం పంచాయతీలో రూ. 3 కోట్లతో 14 గ్రామాల్లో ఇంటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండేది కాదని, నేడు పక్కా రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాడివలస, రాజంపేట గ్రామాల గిరిజన వృద్ధ మహిళలు తాము పుట్టినప్పటి నుండి తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పక్కా రోడ్లు ఏర్పాటు అవుతున్నాయని ఆనందం వెలిబుచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలలో పాల్గొని వారిని బూడి ఆశీర్వదించారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ సోలం రమేష్, ఎం.కోడూరు సర్పంచ్ గొళ్లవిల్లి సంజీవరావు, తాటిపర్తి సర్పంచ్ అల్లంగి లక్ష్మీదేవి, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ని అప్పారావు, అల్లంగి సంజీవరావు, ఎడ్ల కొండబాబు, సోలం రాజేష్, సొలం రమేష్, పడాల అప్పలనాయుడు, చింతా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని నేత జగనన్న

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చిన మాట తప్పని నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ 21వ వార్డు శారదానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించారు. రోడ్లు, డ్రైన్లు లేక ఇబ్బంది పడుతున్నామని వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాధాన్యతక్రమంలో రోడ్లు నిర్మించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నాలుగేళ్ల పాలనలో ఎన్నికల మేనిఫెస్టోలోని 98.6 శాతం హామీలను అమలు చేశారన్నారు. ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ వీనుల చైతన్య, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మళల గణేష్, ఏఎంసీ డైరెక్టర్లు సమ, లోకవరపు శారద, యూత్ నాయకుడు ధనిమిరెడ్డి ప్రసాద్, యాదగిరి శేషు, మామిడి శ్రీనివాసరావు, బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాడుగుల రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు పేర్కొన్నారు. మాడుగుల విశాఖ డెయిరీ పాల సొసైటీ వద్ద గురువారం పాడి రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రెండు నుంచి పది సంవత్సరాల లోపు వయసు కలిగిన పాడి ఆవులు కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. మూడు నుంచి 12 సంవత్సరాలు కలిగిన గేదెలు, వీటితో పాటు ఎద్దులకు అర్హత ఉంటుందన్నారు. దేశవాళీ, సంకర జాతి ఆడ, మగ పశువులకు మూడు సంవత్సరాలకు గాను రూ. 30,000 బీమా కింద అందిస్తామన్నారు. ఈ బీమా కోసం తెల్లరేషన్ కార్డు లేని రైతులు బీమా ప్రీమియంగా రూ. 960 చెల్లించాలని, తెల్లరేషన్‌కార్డు వున్న రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులు రూ. 384 చెల్లించాలన్నారు. రైతులు, పశు వైద్య సిబ్బంది, ఏహెచ్ఎలు పాల్గొన్నారు.

సురక్ష దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలి

మాకవరపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జగనన్న సురక్షపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఇప్పటి వరకు 1470 దరఖాస్తులు రాగా వాటిలో 1300 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్టు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మిగిలినవి కూడా ఆన్‌లైన్ పూర్తిచేసి షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు దారులకు ధృవీకరణ పత్రాలు అందించాలని ఆర్డీవో సూచించారు. ఈ సమీక్షలో డీటీ శంకర్రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

కోలాహలంగా పాల సంఘం అధ్యక్ష ఎన్నికలు



మహలక్ష్మి నాయుడు

కె.కోటపాడు : మండలంలో మర్రివలస పాల సంఘం అధ్యక్షుడిగా కన్నూరు మహలక్ష్మినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సంఘం ఆవరణలో ఇద్దరు డైరెక్టర్లకు గురువారం ఎన్నిక జరిపారు. ఈ రెండు స్థానాలకు కన్నూరు మహలక్ష్మినాయుడు, సీముసురు సూర్యనారాయణలను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం పాల సంఘం అధ్యక్షునిగా కన్నూరు సూర్యనారాయణను 9 మంది డైరెక్టర్లు ఎన్నుకోన్నారు. బాధ్యతలు స్వీకరించిన మహలక్ష్మినాయుడుకు రైతులు అభినందనలు తెలిపారు. వేతన కార్యదర్శి ఎం.చినదేముడు పాల్గొన్నారు.

వేచలం పాల సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

దేవరాపల్లి : మండలంలోని వేచలం పాల సంఘం అధ్యక్షుడిగా వేచలపు కృష్ణ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పాల సంఘంలో పదవీ కాలం ముగిసిన ఇద్దరు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నిక జరగ్గా వేచలపు కృష్ణ, బడబడల సత్తిబాబులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 8 మంది డైరెక్టర్లు కలిసి వేచలపు కృష్ణను సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వరుసగా రెండోసారి ఎన్నికైన సంఘం అధ్యక్షుడు కృష్ణతో పాటు డైరెక్టర్లను జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు సత్కరించి అభినందించారు. విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ టి. గోవిందరావు, ఎన్నికల అధికారి బి. ఈశ్వరరావు, సిబ్బంది ఎం. కృష్ణ, డి. రమేష్‌ల పర్యవేక్షణలో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. కాగా ఎన్నిక సందర్భంగా తగాదాలు జరిగే అవకాశం ఉన్న సమాచారం మేరకు గ్రామానికి చెందిన రెడ్డి బలరాం, వేచలపు గోవింద్‌లను అదుపులోకి తీసుకుని ఎన్నిక అనంతరం విడిచిపెట్టినట్లు కె.కోటపాడు రూరల్ సీఐ తాతారావు తెలిపారు.



నూతన అధ్యక్షుడు వేచలపు కృష్ణతో సత్యం, శరారినాయుడు తదితరులు

'సమస్యలు గుర్తించి నివేదిక సిద్ధం చేయండి'

కోటవురట్ల : జగనన్న సురక్ష కార్యక్రమంపై అలసత్వం వద్దని, సమస్యలు గుర్తించి నివేదిక తయారు చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సచివాలయాన్ని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమ సర్వే వివరాలను తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తుకు ఖచ్చితంగా టోకెన్ జనరేట్ చేయాలన్నారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జూలై 1 నుంచి శిబిరాలు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

జగనన్న సురక్షపై అవగాహన

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. జూలై 1 నుంచి ఈ కార్యక్రమంలో గ్రామ సభలు నిర్వహించనుండటంతో గ్రామాల్లో ముందుగా లబ్ధిదారులకు సమాచారం అందిస్తున్నారు. గురువారం బక్రీద్ సెలవు దినం అయినప్పటికి సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



కొరుప్రోలులో జగనన్న సురక్ష సర్వే వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

రైతు సమస్యల పరిష్కారానికే మహాధర్నా

కె.కోటపాడు : రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను విజయవాడలో నిర్వహించే మహా ధర్నా ద్వారా ప్రభుత్వానికి తెలియజేయనున్నట్లు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి యర్రా దేముడు అన్నారు. ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న మహా ధర్నాపై గురువారం కె.కోటపాడులో ప్రచారం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతుకు పంట పెట్టుబడి ఖర్చులు తగ్గనున్నట్లు దేముడు కోరారు. రైతులకు మేలు చేకూర్చే అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న మహా ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి పండగ

రోలుగుంట: మండలం పడాలపాలెం పంచాయతీ శివారు లగుడు కొత్తూరులో గురువారం తలుపులమ్మతల్లి పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు లగుడు అప్పలనాయుడు తన ఇంటి సమీపంలో దైవంగా భావిస్తున్న వేపచెట్టు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. అనంతరం చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు మరి కొంత నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మాకవరపాలెం: బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న మసీదుకు వివిధ గ్రామాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో గురువారం ఉదయాన్నే చేరుకుని నమాజ్ చేశారు. పేదలకు తోచిన సాయం చేశారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండలంలో గల ముస్లింలు గురువారం బక్రీద్ పండగను వేడుకగా జరుపుకున్నారు. భోగాపురం, కంచుగుమల, రోలుగుంట, కొవ్వూరు గ్రామాల ముస్లింలు రోలుగుంటలో, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, నిండుగొండ గ్రామాల ముస్లింలు నిండుగొండ మసీదు, బుచ్చింపేట, వడ్డిప, శరభవరం గ్రామాల ముస్లింలు ప్రతి నర్సీపట్నం మసీదుకు వెళ్లి నమాజ్ చేసుకుని ఆనందంగా గడిపారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

జి.మాడుగుల: గడుతూరు పంచాయతీ వెదురుపల్లి నుంచి వనమామిడి గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీపీ కె. పద్మ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఎనిమిది గ్రామాల ప్రజలకు రోడ్డు సదుపాయం కలుగుతుందని ఆమె అన్నారు. గర్భిణులకు, రోగులను ఆస్పత్రిలకు తరలించటానికి ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. అప్పలమ్మ, మాజీ ఎంపీటీసీ అప్పారావు పాల్గొన్నారు.

కొండవీధి తారురోడ్డు నిర్మాణం పూర్తి



చీడికాడ నుంచి కొండవీధికి వెళ్లే నూతన తారురోడ్డు

చీడికాడ : ఎట్టకేలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో చీడికాడ, కొండవీధి తారురోడ్డు నిర్మాణం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ రహదారి లేని విషయం డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ. 2.20 కోట్లు కేటాయించారు. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో చీడికాడ, కొండవీధి వాసులకు రహదారి అందుబాటులోకి వచ్చింది. వారు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జగన్నాథ రథయాత్ర



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల : నియోజకవర్గ కేంద్రం మాడుగులలో ఈనెల 20న ప్రారంభమైన జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం జగన్నాథుడు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఇంద్రద్యుమ్నం నుండి జగన్నాథుడు, సుభద్ర, బలభద్ర ఉత్సవ విగ్రహాలను రథయాత్ర ద్వారా ఆలయానికి చేర్చడంతో జగన్నాథ రథయాత్ర ముగిసింది. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు



తామరం వేంటేశ్వస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మారేపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: తొలిఏకాదశిని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో మండలంలోని తామరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

మారేపల్లి వెంకన్న ఆలయంలో..

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి ఉత్తర వాహిని శారదా నది ఒడ్డున పాండవుల కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు గురువారం ఘనంగా జరిగాయి. పురోహితులు రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల నుండి భక్తులు పాల్గొని పూజలు చేశారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

నాతవరంలో..

నాతవరం: మర్రిపాలెంలో శ్రీబాల వినాయక హరిభజన బృందం ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. సుమారు 16 భజన బృందాలు పాల్గొన్నాయి. నాతవరం ఎంబీపట్నం గునుపూడి వైబీ అగ్రహారం, వీబీ అగ్రహారం, వైబీపట్నం, సిద్ధిపట్నం, చిక్కుడుపాలెం, వెదురుపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాతవరంలోని ఈరుడిబాబు కొండపై పానకాల కార్యక్రమాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండలంలోని గ్రామాల్లో గురువారం ఏకాదశి పుణ్యదినాన్ని భక్తులు వేడుకగా నిర్వహించుకున్నారు. స్థానిక సీతారామాలయం అర్చకుడు రేజేటి సీతారామచార్యులు ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. పాల కడలిలో శేషపాన్పుపై శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలోకి జారుకునే ఘడియలనే తొలి ఏకాదశి లేదా శయనైన ఏకాదశి అంటామని తెలిపారు.

రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి



నూతన పాల ఉత్పత్తిదారుల భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయడు తెలిపారు. వంటర్లపాలెంలో నూతనంగా నిర్మించిన పాల ఉత్పత్తిదారుల భవనాన్ని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌బాబుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతు చిన్న సంస్థగా ప్రారంభించిన విశాఖ డెయిరీ నేడు ఇంతటి స్థాయికి చేరుకుందంటే దానికి దివంగత ఆడారి తులసీరావు కృషి, పాడి రైతుల పట్ల వారికున్న ప్రేమ కారణమన్నారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌బాబు మాట్లాడుతు మాడుగుల నియోజకవర్గంలో విశాఖ డెయిరీ తలపెట్టిన ఏ కార్యక్రమానికి అయినా తన వంతు సహకరిస్తానని అన్నారు. డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, స్థానిక పాల సొసైటీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి గోవిందరావు, సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, పాల సొసైటీ కార్యదర్శి గంగుపాం కనకారావు, డెయిరీ ఏరియా మేనేజర్ గుల్లిపల్లి రాము, సూపర్‌వైజర్ సన్యాసిరావు, సొసైటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అంతకు ముందు మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు.

హనుమాన్ టెంపుల్ కూడలిలో ట్రాఫిక్ ఇక్కట్లు



హనుమాన్ కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

రోలుగుంట: రోలుగుంట హనుమాన్ కూడలి వద్ద ప్రతి రోజూ ట్రాఫిక్ జామ్‌తో వాహన చోదకులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ కూడలి నుంచే వడ్డాది, నర్సీపట్నం, కొమరవోలు మీదుగా కుసుర్లపూడి, అనకాపల్లి వెళ్లాల్సి ఉంటుంది. గురువారం మధ్యాహ్నం ఈ కూడలిలో ట్రాక్టర్లు, ఆటోలు, లారీలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుని గంటపాటు ఆగిపోయాయి. దీంతో నర్సీపట్నం, చోడవరం వెళ్లే బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చినపాచిల, మత్స్యపురం గ్రామాల్లో ఫాగింగ్



ఫాగింగ్ చేయిస్తున్న ఉప సర్పంచ్ శంకర్రావు

రావికమతం : చినపాచిల, మత్స్యపురం గ్రామాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు. ఆయా గ్రామాల్లో దోమల బెడద అధికం కావడంతో పలువురు గ్రామస్తులు పంచాయతీ దృష్టికి ఈ విషయం తేగా ఉప సర్పంచ్ శంకర్రావు ప్రత్యేక సిబ్బందిచే డెల్టా మెత్రిన్, పైరిత్రిన్ మందును ఆ రెండు గ్రామాల్లో ఫాగింగ్ చేయించారు.

బోయిలకింతాడ-చుక్కపల్లి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

దేవరాపల్లి : డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో బోయిలకింతాడ, చుక్కపల్లి రోడ్డుకు మహర్దశ పట్టిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. దేవరాపల్లి మండలం బోయిలకింతాడ నుండి చీడికాడ మండలం చుక్కపల్లి వరకు తారురోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 1.80 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సుమారు మూడు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి స్థానిక పెద్దలు కిశోర్ రాజుతో కలిసి బాబూరావు గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించిన డిప్యూటీ సీఎంకు తామంతా రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. దేవరాపల్లి మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ అన్నం రామునాయుడు, సచివాలయ కన్వీనర్ దాసరి వెంకటరమణ, బొబ్బిలి రాము, మాజీ ఉప సర్పంచ్ కోన శ్రీను, సీనియర్ నాయకుడు కోన సత్యం, అన్నం వెంకటరావు, బొబ్బిలి శ్రీను, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.